క్లుప్తంగా

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

కార్తీకంలో అన్నసమారాధన శుభప్రదం


అన్నసమారాధన ప్రారంభిస్తున్న మళ్ల సురేంద్ర, తదితరులు

అల్లిపురం: కార్తీకంలో అన్నసమారాధన శుభప్రదమని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. సోమవారం ఆయన వేంకటేశ్వర మెట్టపై వెలసిన శ్రీ గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పలకు, భవానీలకు అన్నసమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ప్రతినిధులు శరగడం భాస్కర్, మళ్ల వెంకటరావు, రఘు, భీమరశెట్టి కుమార్, బుద్ధ జోగి నాయుడు, భానుచంద్ర, విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

అల్లిపురం: పేదలకు ఎంతో కొంత సాయం చేయడం తనకిష్టమని 33వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము అన్నారు. సోమవారం ఆయన వార్డులోని పేద మహిళలకు 5 కేజీల బియ్యం ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ప్రతీ నెల పేద మహిళలు, వద్ధులకు బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు.

స్వీయ క్రమశిక్షణతో విజయం

సీతమ్మధార: విద్యార్థులు స్వీయ క్రమశిక్షణతో విజయం సాధించగలరని, ఉజ్వల భవిత సొంతమవుతుందని ఆంధ్రా యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ పీవీ కృష్ణ అన్నారు. ద్వారకా నగర్‌లోని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు సోమవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత విలువలతో కూడిన విద్య ద్వారానే లక్ష్యాలు సాధించగలరన్నారు. గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షులు డి.దక్షిణామూర్తి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యా అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందడిగా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో డి.గిరిధర్, సరిత, ప్రగడ రాజ గణపతి, వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎస్.రజని, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి


వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలంతా వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్ – 4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. సోమారం జోన్ – 4 కార్యాలయంలో అర్జీదారుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలను కార్యాలయల చుట్టూ తిప్పుకూడదన్నారు. పరిష్కరించిన సమస్యల వివరాలు రికార్డులో రాసి ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ రూన్సీ, రెవెన్యూ అధికారి అప్పలరాజు, తదతరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు..!

జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంతో నెరవేరని లక్ష్యం


జ్ఞానాపురం రైల్వే స్టేషన్ నుంచి కంచరపాలెం వెళ్లే బ్రిడ్జిపై ఎండిపోయిన మొక్కలు

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. నగరంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల సహకారంతో నాటిన మొక్కలను సిబ్బంది సంరక్షించడం లేదు. మొక్కలు నాటేటప్పుడు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుని హంగామా చేస్తున్న అధికారులు తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. నగర పరిధిలో గత ఆరు నెలల్లో పర్యావరణ పరిరక్షణ కోసం వేలాది మొక్కలు నాటారు. కానీ వాటి సంరక్షణను ఇటు అధికారులు, అటు సిబ్బంది విస్మరిస్తున్నారు. రెండు నెలల కిందట నగరంలోని రామ్మూర్తిపేట బ్రిడ్జిని రంగులతో అద్దారు. బ్రిడ్జికి ఇరువైపులా నాలుగు ప్రాంతాల్లో (రైల్వే ట్రాక్ ఉన్న చోట) పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అంతవరకూ బాగానే ఉన్నప్పటికీ... వాటి సంరక్షణలో పూర్తిగా విఫలమవడంతో ఆ మొక్కలన్నీ చచ్చిపోయాయి. ఫలితంగా వెచ్చించిన లక్షలాది రూపాయలు బూడిదలో పోసినట్లైంది. అంతేగాక బ్రిడ్జి సెంటర్ మీడియన్‌లో వేసిన మొక్కలు కూడా జీవచ్ఛవంలా పడి ఉన్నాయి. నీరు అందక చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి.


సెంట్రల్ మీడియన్‌లో ఎండిపోతున్న మొక్కలు

ఇటీవలే కాలుష్య నియంత్రణకు హెచ్‌పీసీఎల్ చేస్తున్న కృషిని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అభినందించారు. జోన్ – 2 పరిధి ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫార్మ్ స్టేషన్ ఆవరణలో బుధవారం హెచ్‌పీసీఎల్ సహకారంతో మొక్కలు నాటారు. అంతేగాక కాలుష్య నియంత్రణకు హెచ్‌పీసీఎల్ సామాజిక బాధ్యతగా రూ.88 లక్షలు కేటాయించింది. ఆ నిధులతో నగరంలో 26,500 మొక్కలు నాటనున్నారు. అలాగే ప్రజలను కూడా భాగస్వాములను చేసి నగరంలో పలుచోట్ల మొక్కలు నాటించే కార్యక్రమాలు చేపడతామని కమిషనర్ ప్రకటించారు. అయితే నాటిన మొక్కలకు నీరు పోసి సంరక్షిస్తే బాగుంటుందని.., నగరమంతా మొక్కలు నాటి సంరక్షించకపోతే రామ్మూర్తిపంతులు పేట బ్రిడ్జి తరహాలో చచ్చి ఊరుకుంటాయని నగరవాసులు అంటున్నారు.

శ్రీవిశ్వ కళాశాలపై చర్యలు చేపట్టాలి

దాబాగార్డెన్స్: శ్రీ విశ్వ కళాశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎస్ఎఫ్ఐ బృందం సోమవారం పరామర్శించింది. అనంతరం కళాశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షుడు జి.రాము, ఉపాధ్యక్షుడు జి.అజయ్ మాట్లాడుతూ ఆదివారం రాత్రి శ్రీ విశ్వ కళాశాల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని, ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో అనేక కళాశాలల హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనలు సంభవిస్తున్నాయన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటరమణ, సాయితేజ, తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యతో సమాజంలో మార్పు

దాబాగార్డెన్స్: స్వాతంత్ర్య సమరయోధుడు, స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కాలం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని పైడా డిగ్రీ కళాశాల, పైడా మహిళా కళాశాల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ టీవీ కృష్ణ పాల్గొని విద్య ఆవశ్యకత, ఆజాద్ జీవిత విశేషాలు విద్యార్థులకు వివరించారు. పైడా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ్ మాట్లాడుతూ విద్యతో సమాజంలో ఏ విధంగా మార్పు వస్తుందో వివరించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


విద్యార్థులతో ప్రొఫెసర్ టీవీ కృష్ణ, తదితరులు

బల్లిగిరిపై ఏకాదశికి ఏర్పాట్లు

అల్లిపురం: కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, మంచినీరు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాభాయి తెలిపారు. తెల్లవారుజామున 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులు సంయమనంతో క్యూలైన్లలో వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు. ఏకాదశి కావటంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.


బల్లిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

హైదరాబాద్‌లో తొలి విడత ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకలు

దాబాగార్డెన్స్: ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ వచ్చే నెల 29న విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న 2వ విశాఖ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో భాగంగా తొలి విడత చిత్రాల ప్రదర్శన హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పులగం రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా ఈ నెల 16న సాయంత్రం 6 గంటలకు ఇన్ ది లాప్(మళయాళం), 6.30 గంటలకు డెడ్ ఎండ్(తెలుగు), 7 గంటలకు సుమం(కన్నడ), 7.30 గంటలకు క్యూసెరాసెర(తెలుగు), రాత్రి 8 గంటలకు ఇన్ ది లాప్(హిందీ), 8.30 గంటలకు సాగరవాసి(తెలుగు) తదితర చిత్రాలు ప్రదర్శించనున్నట్టు చెప్పారు. నటుడు, దర్శకుడు తనికెళ్ల భరణి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి దాశరధి, ఫిలిం సొసైటీ అధ్యక్షుడు ఎస్ వినయ్‌కుమార్, దూరదర్శన్ సీనియర్ అనౌన్సర్ విజయదుర్గ, బీడీఎల్ సత్యనారాయణ, రచయిత్రి జాలాది విజయ, హిందీ చిత్ర దర్శకుడు కపిల్ జోన్‌థాలే, హెచ్ఆర్ దిలీప్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొంటున్నట్టు తెలిపారు.

వేడుకగా గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవం


గౌరీ పరమేశ్వరుల ప్రతిమలు

అల్లిపురం: వేంకటేశ్వర మెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం శ్రీ గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను తిరువీధిగా బృందావన్ జంక్షన్ నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య తోడ్కొని వచ్చారు. కల్యాణ మండపంలో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. భక్తుల శివనామ స్మరణతో వెంకటేశ్వర మెట్ట మార్మోగింది. కార్యక్రమంలో పీల చిన అప్పలనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

'ల్యాబ్ టూ స్కూల్'తో మేలు


ప్రయోగాలు చేసి వివరిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ల్యాబ్ టూ స్కూల్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు, విద్యార్థులు స్థానిక ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలను సందర్శించి పాఠశాల విద్యార్థులకు ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి, వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ల్యాబ్ టూస్కూల్ కార్యక్రమం తమ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని కళాశాలను అభినందిస్తూ ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు బి.సంతోషి అనూష, హైమావతి పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకరించాలి


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని నియంత్రించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా నియంత్రణకు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

అంతర పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం


వందన సమర్పణ చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విశాఖ అతిమేత్రాసన వేదికగా మూడు రోజులు నిర్వహించే అంతర పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విశాఖ జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి రవీంద్రబాబు క్రీడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యాన్ని, క్రీడా స్ఫూర్తిని, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విశాఖ అతిమేత్రాసన పాఠశాలల డిప్యూటీ జనరల్ మేనేజర్ ఫాదర్ పాలమరశెట్టి రత్నకుమార్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ, ఫాదర్లు డి.బాలశౌరి, జొన్నాడ జాన్ ప్రకాశ్, ఎస్.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మాతృ సంస్థలకు పంపించండి


వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

దాబాగార్డెన్స్: అర్హత లేకుండా డిప్యూటేషన్‌పై విశ్వ విద్యాలయంలో కొనసాగుతున్న డిగ్రీ అధ్యాపకులను వారి మాతృ సంస్థలకు పంపించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏయూ శాఖ సభ్యులు సోమవారం కళాశాల కమిషనర్ భరత్ గుప్తాకు, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి గుడిపాటి సుబ్బరాజు మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో నాణ్యమైన విద్య అందుతుందని ఎన్నో ఆశలతో విద్యార్థులు వస్తున్నారన్నారు. అటువంటి వర్సిటీలోకి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి అక్రమంగా వచ్చిన, అర్హత లేని అధ్యాపకుల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. అర్హత లేని అధ్యాపకులను త్వరితగతిన విశ్వ విద్యాలయం నుంచి తొలగించి, వారి మాతృ సంస్థలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర విశ్వ విద్యాలయాల కన్వీనర్ కిరణ్‌కుమార్, పవన్, వంశీ పాల్గొన్నారు.

విద్యను మించిన ఆస్తి లేదు


మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

దాబాగార్డెన్స్: నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీఎన్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ విద్య గొప్పతనాన్ని, విద్యకు ఉన్న శక్తిని విద్యార్థులకు వివరించారు. అల్లాడ రాజు మాట్లాడుతూ విద్యను మించిన ధనం లేదన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర సంచాలకుడు పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ కడారి కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఎస్‌వీఆర్ నాయుడు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మురుగు కాలువ


వెలంపేట వద్ద ప్రమాదకరంగా మారిన కాలువ

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో మురుగు కాలువ ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెలంపేట దరి బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఓ మురుగు కాలువతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కలిపి ఉన్నాయి. అయితే యూజీడీ, కాలువపై సిమెంట్ పలకలు పూర్తిగా శిథిలమైపోవడంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్లుగా కాలువ ఇదే స్థితిలో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వృద్ధులు, వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. కాలువలోనే యూజీడీ కూడా ఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వెలంపేటవాసులు కోరుతున్నారు.

హరహర మహాదేవ శంభోశంకర

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఉమా చంద్రమౌళేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు


ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: పరమ శివునికి ప్రీతికరమైన కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. సింగ్ హోటల్ జంక్షన్ ఓంకార ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గొల్లలపాలెం శెట్టిబలిజ సంఘం సమీపంలోని సాయి రామలింగేశ్వరాలయం రావి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. సూర్యాబాగ్ విశ్వేశ్వరాలయంలో వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. స్వామికి ఏకవారాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అస్సాం గార్డెన్స్ శ్రీశివరామకృష్ణ దేవస్థానం, బౌదరా రోడ్డులో గల మురళీధర వీధి శ్రీపంచముఖేశ్వర దక్షిణామూర్తేశ్వర దేవాలయం, సూర్యాబాగ్ అగ్నిమాపక కేంద్రం సమీపాన ఉన్న ఉమా రామలింగేశ్వరాలయంలో భక్తులు పూజలు చేశారు. ఏవీఎన్ కాలేజీలోని శివాలయంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు.

అల్లిపురం: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివయ్యను దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ముక్కంటికి పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. నియోజకవర్గంలో టూ టౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళేశ్వర స్వామికి ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు చేశారు.

డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ భవానీ శంకర గణపతి ఆలయంలో, బౌదరా రోడ్డులో గల శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం, మురళీధరవీధిలోని పంచముఖేశ్వరస్వామి దేవాలయంలో విశేషంగా పూజలు చేశారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించి, దీప దర్శనం చేసుకుని తరించారు.

ఉపాధి అవకాశాలపై క్యాంపస్ డ్రైవ్

దాబాగార్డెన్స్: ఉపాధి అవకాశాలపై క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్టు పార్క్ హయత్ జనరల్ మేనేజర్ మార్క్ స్టెర్న్ జియల్ పేర్కొన్నారు. నగరంలోని సన్ క్యాంపస్‌లో గ్రాండ్ హయత్, యూనియన్ స్టేషన్ నాష్ విల్లే సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఆయన మాట్లాడారు. హోటల్ రంగంలో వంట, ఆహారం, ఫ్రంట్ ఆఫీస్, హౌస్ కీపింగ్ విభాగాల్లో ఉపాధి అవకాశాల కోసం ఈ డ్రైవ్ నిర్వహించడం ద్వారా మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. విదేశాల్లో ఈ తరహా ఉపాధికి మంచి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్క్ హయత్ హెచ్ఆర్ మేనేజర్ గిడియాన్ ప్యాకినాదన్, సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు మహిళ

సీతమ్మధార : బొబ్బిలికి చెందిన ఒక గృహిణి భర్త వేధింపులు తాళలేక విశాఖ వచ్చేయడంతో ఆశ్రయం కల్పించిన వసతిగృహం నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సోమవారం అప్పగించారు. ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలికి చెందిన నాగమణి (45)కి ఇద్దరు పిల్లలు న్నారు. మద్యానికి బానిసైన భర్త పెట్టే చిత్రహింసలు భరించలేక ఆమె పిల్లలను బంధువులకు అప్పగించి ఇల్లు వదిలి విశాఖ వచ్చేసింది. రైల్వేస్టేషన్లో తిరుగుతున్న ఆమెకు ఏయూటీడీ సిబ్బంది ద్వారకానగర్‌లో గల టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఆశ్రయమిచ్చారు. ఎట్టకేలకు ఆమె మేనత్త ఆదిలక్ష్మి అడ్రస్ తెలుసుకుని షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి సమక్షంలో నాగమణిని అప్పగించారు.

కుమారుడి చెంతకు తల్లి

అదేవిధంగా ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో ఆశ్రయం పొందుతున్న నడిమింటి రాజేశ్వరి (68)ని కుమారుడికి అప్పగించారు. కొద్ది రోజుల కిందట ఆమె రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండడంతో రైల్వే పోలీసుల సమాచారంతో ఏయూటీడీ సిబ్బంది రాజేశ్వరిని తీసుకొచ్చి ఆశ్రయమిచ్చారు. ఇంతలో రైల్వే ఉద్యోగి అయిన ఆమె పెద్ద కుమారుడు రమణమూర్తి తప్పిపోయిన తల్లిని వెతుక్కుంటూ షెల్టర్‌కు వచ్చారు. తన తమ్ముడు శ్రీకాకుళం నుంచి ఫోన్ చేసి చెప్పడంతో ఆందోళనతో వెతుకుతున్నానని చెప్పారు. తన తల్లిని జాగ్రత్తగా అప్పగించినందుకు షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి, ఇతర సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కుటుంబ సభ్యులకు వివాహిత అప్పగింత

అల్లిపురం: గత ఏడాది కాలంగా కనిపించకుండాపోయిన వివాహితను వన్ టౌన్ పోలీసులు గుర్తించారు. సీఐ జీడీ బాబు తెలిపిన వివరాల ప్రకారం... గత సంవత్సర కాలంగా వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఒక వివాహిత కనిపించలేదని ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆమెను సోమవారం గమనించిన పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇసుక తవ్వకాలు ప్రైవేటుకివ్వడం అన్యాయం

సీతంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఫైల్‌పై పెడతామని హామీలిచ్చిన నాయకులు నేటికీ అమలు చేయలేదని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, జి.ఎస్.జె.అచ్యుతరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక అని ప్రకటించారు తప్ప ఎక్కడా ఉచితంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జీవో నంబరు 66 రద్దు చేయకుంటే ఉచిత ఇసుక పాలసీ నిర్వీర్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మథరావు, ఎస్.కె.రెహమాన్, జి.రాంబాబు, జె.డి.నాయుడు, ఎంపి బేగం పాల్గొన్నారు.